క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

పాములపాడు: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ప్రజల ఫిర్యాదుల పట్ల అలసత్వం వద్దని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఎస్ఐ సరేష్ ఉన్నారు.

మహానందీశ్వరుడికి రైల్వే డీఆర్‌ఎం పూజలు



దర్శనానికి వస్తున్న రైల్వే డీఆర్‌ఎం చంద్రశేఖర గుప్తా దంపతులు

మహానంది: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మహానందికి వచ్చారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ఎరమల మధు, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. డీఆర్‌ఎం చంద్రశేఖర గుప్తా, కుటుంబ సభ్యులు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

అగ్నిప్రమాదంలో రైతులకు నష్టం



కాలిన పసుపు

మహానంది: బుక్కాపురం గ్రామానికి చెందిన రైతులు నిల్వ చేసుకున్న విత్తనం పసుపు శనివారం అగ్నిప్రమాదంలో కాలిపోయింది. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రైతులు సూరి, రవి, ప్రసాద్‌లు విత్తనం పసుపును నిల్వ ఉంచుకున్నారు. పక్కనే బీడు పొలంలో మంటలు చెలరేగడంతో పసుపు కుప్పకు వ్యాపించాయి. మంటలను అదుపులోకి తీసుకురావడంతో పాటు రైతులు నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆర్పేశారు. ప్రమాదంలో సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళారాధన వద్ద శనివారం సికింద్రాబాద్‌కు చెందిన మాధురి జొన్నలగడ్డ, వారి బృందం గాత్రకచేరి ఆకట్టుకుంది. సిద్ధివినాయకం, శంకరా శివశంకరా, శివాయా పరమేశ్వరా, శరణు శరణు, శివపంచాక్షరీ, జయ జయ దుర్గా, బ్రహ్మమురారి, నమశ్శివాయ నటేశ్వరాయ తదితర గీతాలను, అష్టకాలను జె. మాధురి, లక్ష్మీలావణ్య, తేజశ్వని, ఆనందిని, మహేష్ ఆలపించారు.

సోలారు పనులు నిలిపివేయాలి



ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి, సీపీఎం నాయకులు

నందికొట్కూరు: సోలారు పనులను నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మిడుతూరు మండల పరిధిలోని పైపాలెం గ్రామ సమీపంలో సోలారు పనులు జరిగే ప్రాంతంలో గ్రామస్తులతో కలిసి లబ్బి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రైతులకు నష్టం కలిగించే సోలారు పనులను తక్షణమే ఆపాలన్నారు.

పూజలకు వేళాయె!

- ఈనె 10 నుంచి 14 వరకు ఈశ్వరస్వామి తిరుణాల
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి పూజలకు సిద్ధమయ్యారు. ఈ నెల 20 నుంచి 14వ తేదీ వరకు స్వామి వారి తిరుణాల నిర్వహించేందుకు నిర్వాహకులు ఇప్పటికే ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం ముందు భాగంలో ఆకుపచ్చని పందిరితో ముస్తాబు చేశారు. ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు లాల్ బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో దేవదాయశాఖ నిర్వహించనున్నట్లు ఈఓ కార్తీక్ తెలిపారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం

తిరుణాలలో భాగంగా ఈనె 10న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివుడికి అభిషేకాలు, గణపతి పూజ అనంతరం రాత్రి కల్యాణ తంతు నిర్వహిస్తారు.

ప్రభోత్సవం

11న ఉదయం నుంచి ఉత్సవమూర్తులకు అభిషేకాధిపూజాకార్యక్రమాలు, సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రభవాహనంపై ఉంచి గ్రామ పుర వీధుల వెంట ఊరేగింపు ఉంటుంది.



గువ్వలకుంట్ల గ్రామంలో తిరునాల్లకు విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం

రథోత్సవం

12న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శివపార్వతులకు అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం అన్నదాన ఉంటుంది. సాయంత్రం ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి గ్రామ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించనున్నారు.

పారువేట

13న శివపార్వులతకు అభిషేకాలు, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. శివపార్వతుల ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకీలో కొలువుంచి గ్రామంలో ఊరేగింపు చేసి, గ్రామశివారులోకి తీసుకెళ్లి పారువేట గొర్రెను వదిలి ఉత్సవాన్ని నిర్వహిస్తారు

- 14న చివరి రోజు తీర్థావళీ, విశేష పూజా కైంకర్యాలు నిర్వహించి ఈశ్వరస్వామివార్ల తిరుణాల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

జూపాడుబంగ్లా: నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకొన్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాజు, గాబ్రియేలు, ఏసన్న, సోమప్ప, లింగన్న, మాబాషా, అన్వర్‌బాషా, తిమ్మప్ప, కృష్ణ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, నాయకులు

తంగడంచ ఫారం భూములను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూములను అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనలో 211 ఎకరాలను అంబుజా కంపెనీకి కేటాయించగా కంపెనీ వెనక్కెళ్లిందన్నారు. ప్రస్తుతం ఆ భూములు ఏపీఐఐసీ అధ్వర్యంలో ఉన్నా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. 624 ఎకరాల్లో జైన్‌పరిశ్రమ ఏర్పాటుచేసినా 100 మందికి కూడా ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. జైన్ పరిశ్రమకిచ్చిన భూములను రద్దుచేసి వాటిల్లో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తిచేసి సీడ్‌ప్రోగ్రాం కింద రాయితీపై రైతులకు ఇవ్వాలని కోరారు.

వైభవంగా మేరిమాత ఉత్సవాలు



భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

నందికొట్కూరు: పట్టణంలోని నందికొట్కూరు విచారణ పరిధిలో ఆర్‌సీఎం చర్చి ఆవరణలో వేలంగణి మాత మహోత్సవాలు శనివారం వైభవంగా జరుగుతున్నాయి. ముఖ్య అతిథిగా కడప జిల్లా ఆర్‌సీఎం చర్చి మేత్రాసన బిషప్ సగినాల పాల్ ప్రకాష్ హాజరై దైవ సందేశం ఇచ్చారు. భక్తులు చర్చిలో ప్రార్థనలు చేశారు. తల వెంట్రుకలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జ్యోతులు వెలిగించి దర్శనం చేసుకున్నారు. భక్తుల రద్దీతో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.



దేవుని వాక్యం బోధిస్తున్న కడప జిల్లా ఆర్‌సీఎం చర్చి మేత్రాసన బిషప్ సగినాల పాల్ ప్రకాష్

దాహం.. దాహం

- మూడు రోజులుగా అల్లాడుతున్న గ్రామస్తులు

పగిడ్యాల: మండల కేంద్రమైన పగిడ్యాలలో మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడం వలన ఎస్సీ,బీసీ, మైనార్టీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంకిరేణిపల్లె నుంచి పగిడ్యాలకు వచ్చే పైప్‌లైన్, నల్లవాగు నుంచి పాలమర్రి ట్యాంక్‌కు సరఫరా చేసే పైప్‌లైన్‌లు లీకేజీలు కావడం వలన నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా కాలనీవాసులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పంచాయతీ అధికారులు మరమ్మత్తు చర్యలు చేపట్టకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికం కావడం వలన తాగునీటి అవసరత అధికంగా ఉంది. అయితే పైప్‌లైన్‌లకు మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంలో జాప్యం చోటుచేసుకోవడం వలన ప్రజలు ఎదుర్కొంటున్నా కష్టాలు వర్ణాతీతం. మూడు రోజులుగా ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించి నీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఇంకా పశువులు కలిగిన వారి పరిస్థితిని మాటల్లో వర్ణించలేం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించి ప్రజల దాహార్తిని తీర్చాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నందికొట్కూరు: పట్టణంలోని ఎన్‌టీఆర్ జలాశయంలో శనివారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 55 ఏళ్ల వయస్సు ఉంటుందని, క్రీమ్ కలరు రంగు, తెలుపు, నిలువు గీతలు ఫుల్ షర్ట్ ధరించాడన్నారు. 9 పొరల తెల్లని దారం జంజం ఉందన్నారు. షర్ట్‌పై కేఎస్‌ఎల్ 111 లేబుల్ ఉందన్నారు. ఎవరైనా అతడి ఆచూకీ తెలిస్తే 9121101187కు సమాచారం ఇవ్వాలన్నారు. వీఆర్వో ఎం.సోమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

పీవీ రావు సేవలు మరువలేనివి

నందికొట్కూరు: మాలల ఆశా జ్యోతి పీవీ రావు సేవలు మరవలేనివని మాలమహానాడు డివిజన్ అధ్యక్షులు శివప్రసాద్ అన్నారు. శనివారం మాలమహానాడు కార్యాలయంలో మాలమహానాడు వ్యవస్థాపకులు దివంగత పీవీ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఏబీసీడీలుగా ఎస్సీలను వర్గీకరణ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రభుత్వానికే ఎదురొడ్డి నిలిచి పోరాడినా ఏకైక చరిత్ర కలిగిన వ్యక్తి పీవీ రావు అన్నారు. ఆయన అడుగుజాడల్లో మాలలు నడవాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు డివిజన్ కమిటీ నాయకులు మధు, పుల్లయ్య, శ్రీను, రాజు, నాగన్న, నాగేంద్ర, అయ్యన్న, నాగరాజు పాల్గొన్నారు.

- కొత్తపల్లి: మండలంలోని జి.వీరాపురం గ్రామంలో మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల నాయకుడు గనమల మల్లయ్య, నాయకులు కళ్యాణ్, వెంకటరమణ, ఓబులేసు, లింగస్వామి, శేషన్న, ప్రవీణమ్మ, శ్యామలమ్మ, పద్మమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పీవీ రావు చిత్ర పటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

అన్నదానం

ఆత్మకూరు: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విరాళాలు కూడా అందించారన్నారు. అంతకుముందు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి జయంతి

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు నిర్వహించనునున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సుభద్రమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుతో పాటు కొత్తగా పేర్లను నమోదు చేయించుకోవడం, రేషన్‌కార్డులో నుంచి సభ్యులను తొలగించడం, రేషన్ కార్డులను సరెండర్ చేయడం, చిరునా మాలు మార్చడం వంటి అవకాశాలున్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రేపు అంకాల పరమేశ్వరీ దేవి వార్షికోత్సవం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని అంకాల పరమేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 12న వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 12న అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహిస్తామన్నారు. 13న బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంత బాలికలకు ఉచిత విద్య

పాములపాడు: గ్రామీణ ప్రాంత బాలికలకు ఎ ట్రీ రెసిడెన్సియల్ హైస్కూల్‌లో ఉచిత విద్య అందించనున్నట్లు వావిలాల కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్టు కోశాధికారి, మాజీ సైనికుడు రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 4న పరీక్ష నిర్వహించామని, మళ్లీ 11, 18, 25 తేదీల్లో మరోసారి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంత బాలికలు పాస్‌ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంకు వద్ద(రామేశ్వరనగర్) వీవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఉన్న వావిలాల కృష్ణమూర్తి ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9848626114, 9000911477 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

కోలుకోలేక మహిళ మృతి



లక్ష్మి(ఫైల్)

కొత్తపల్లి: భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత కోలేకోలేక శనివారం మృతి చెందింది. ఎస్ఐ ఆర్.జయశేఖర్ తెలిపిన వివరాలు.. మండలంలోని బండినాయిని పాలెంకు చెందిన శివపురం రామకృష్ణకు 8 ఏళ్ల క్రితం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన లక్ష్మి(24)తో వివాహమైంది. వీరికి 7, 5 ఏళ్ల వయస్సున్న కుమారులు ఉన్నారు. కొంతకాలంగా లక్ష్మిని భర్త వేధించేవాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై శుక్రవారం రాత్రి కల్లాపి పొడి నీటిలో కలపుకుని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహానంది కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

వీకెండ్ సందడి

మహానంది: మహానంది ఆలయం వీకెండ్ సందర్భంగా శనివారం భక్తజనసంద్రంగా మారింది. వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అష్టవిధ మహామంగళ హారతులు చేపట్టారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి యాగశాలలో స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవ పూజలు చేపట్టారు.

చిన్నారులకు తల్లుల ఆశీర్వాదం

నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామంలోని ఒకటో అంగన్‌వాడీ సెంటర్‌లో మాతృదినోత్సవాల్లో భాగంగా శనివారం చిన్నారులను తల్లులు ఆశీర్వదించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ శెట్టి లలితమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తల్లి రుణం తీర్చుకోలేనిది

జూపాడుబంగ్లా: తల్లి రుణం తీర్చుకోలేనిదని అంగన్‌వాడీ వర్కర్లు వెంకటరమణమ్మ, అనసూయమ్మ, సరస్వతీ తెలిపారు. 'మదర్స్ డే' సందర్భంగా శనివారం జూపాడుబంగ్లా–1, 80బన్నూరు–1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రుల ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. అనంతరం పిల్లలతో తల్లులకు పాదాభివందనం చేయించారు.



పిల్లలను దీవిస్తున్న తల్లులు

మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐలు జఫ్రుల్లా, శ్రీనివాసులు

నందికొట్కూరు: నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాసులు జఫ్రుల్లా కోరారు. మాదకద్రవ్యాలు, మత్తు, పదార్థాలు, సారా వినియోగం గురించి శనివారం ఎరుకలిపేట వాసులకు అవగాహన కల్పించారు. నాటు సారా రహిత పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, పద్మనాభం, పోలీసులు శివన్న, రమిజాబీ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

బండి ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన జల్లి లక్ష్మీదేవి(70) అదృశ్యమైటన్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. లక్ష్మీదేవి శిరివెళ్లలో ఉన్న తన సోదరిని చూసేందుకని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. అయితే సోదరి ఇంటికి చేరుకోలేదు. ఇటు స్వగ్రామానికి రాలేదు. దీంతో కుమారుడు నరసయ్య తెలిసిన చోటల్లా వెతికాడు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదాల నివారణకే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

నందికొట్కూరు: అగ్ని ప్రమాదాలను నివారించేందుకే అగ్నిమాపక కేంద్ర భవనం ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే కర్నూలు, ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలు, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయాల్సి ఉండేదన్నారు. అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయేదన్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకుని నందికొట్కూరులోనే నూతన అగ్నిమాపక కేంద్ర భవనానికి భూమి పూజ చేశామన్నారు. కాగా ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వేర్వేరుగా భూమి పూజలు చేయడంతో అగ్నిమాపక శాఖ అధికారులు తలలు పట్టుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక రాయలసీమ జోన్ డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పాత ముచ్చుమర్రి శివాలయ గోపురంపై మొలకెత్తిన రావిచెట్టు



చేదుడు బావిలో పచ్చదనంతో కనువిందు చేస్తున్న దృశ్యం

ఎక్కడైనా బతికేస్తాం..!

నీటి ఆధారం లేకపోయినా రాతి కట్టడాలపై కూడా బతికేస్తామంటున్నాయి మొక్కలు. పాత ముచ్చుమర్రి శివాలయ ఆలయ గోపురంపై రావి చెట్టు పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. ఎలాంటి నీరు, భూ ఆధారం లేకపోయినా రాతి కట్టడాల సంధుల్లో ఆలయ గోపురం, చేదుడు బావి కట్టడాల్లో మొలకెత్తిన రావి చెట్టు, ఇంద్రిక చెట్టు పచ్చదనంతో ఉట్టిపడుతోంది. మండు వేసవిలో సైతం కంటికి ఆహ్లాదాన్ని ఇస్తూ అలరారుతోంది. నిత్యం నీరు పోసి పెంచే చెట్లు కూడా ఈ ఎండ తీవ్రతకు ఆకులు వాడిపోయి కనిపిస్తాయి. కానీ ఆలయంపై ఉన్న రావి మొలకలు మాత్రం నిండు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి.

– పగిడ్యాల

15న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగభూషణంశెట్టి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.